క్లుప్తంగా

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహించనున్నట్లు కమిషనర్ జె.అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు వైఎస్సార్ జయంతి

చిత్తూరు కార్పొరేషన్/పూతలపట్టు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ జయంతి సందర్భంగా సోమవారం నివాళి అర్పించనున్నట్లు వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి తెలిపారు. ఉదయం డీసీసీబీ, జెడ్పీ కార్యాలయ ఆవరణలోని వైఎస్సార్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం గుడిపాల శ్రీరంగం పల్లెలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటామన్నారు. కావున పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు. పూతలపట్టు మండలంలోని పి.కొత్తకోటలో వైఎస్సార్ జయంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల పార్టీ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. దీనికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ హాజరవుతారని తెలిపారు.

వాహనదారులకు జరిమానా

గుడిపాల: చెన్నై–బెంగుళూరు జాతీయ రహదారిలోని గుడిపాల పోలీస్‌స్టేషన్ వద్ద ఆదివారం ఎస్ఐ నరేంద్రకుమార్ వాహనాలను తనిఖీచేసి జరిమానాలు విధించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు లైసెన్స్‌లు, హెల్మెట్‌లు లేని వారికి అపరాధ రుసుం వేశారు. ఇకపై వాహనాల్లో ప్రయాణించే వారికి లైసెన్స్‌లతో పాటు ఇన్సూరెన్స్‌లు, హెల్మెట్‌లు తప్పనిసరిగా ఉండాలన్నారు. అనంతరం 20 వాహనాలకు పైగా జరిమానాలు విధించారు.

అప్రమత్తంగా ఉండాలి

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాకు వర్షసూచన ఉండడంతో క్షేత్రస్థాయిలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో అర్బన్ ఈఈ మునిచంద్ర తెలిపారు. పలు ప్రాంతాల్లో ఆదివారం వర్షం కురిసిందన్నారు. జేఎల్ఎం, ఎల్ఎం, ఎల్ఐలు విద్యుత్ సమస్య ఏర్పడితే అప్పటికప్పుడు పరిష్కరించాలని చెప్పారు. కరెంటు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోతే వాటిని మార్పు చేయాలని సమస్యలను సకాలంలో పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని వివరించారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

పూతలపట్టు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సుబ్రమణ్యం రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని రైతులు, యువకులు, ప్రజలు తమ సమస్య లను అర్జీ రూపంలో అందించవచ్చని వివరించారు.

సేంద్రియ ఎరువులతో సాగు చేసిన పొలంలో మహిళారైతు



పంటకు ఎరువు వేస్తున్న మహిళ




వరి నాట్లలో రైతులు



నేలకు సారం.. పంటకు జీవం

- జీవన ఎరువులతో విశేష ప్రయోజనాలు
- దిగుబడులతో పాటు పర్యావరణానికి మేలు



బంగారుపాళెం: వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకం రోజురోజుకూ పెరిగిపోతుంది. దీంతో నేల సారం కోల్పోవడమే కాకుండా రసాయన అవశేషాలు పంట దిగుబడిలో ఉండిపోయి. అనారోగ్యం కలుగజేస్తోంది. భూమిలోని సూక్ష్మజీవుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడంతో నేలకు ఉన్న సహజగుణాలు, సారం క్షీణించిపోతున్నాయి. పర్యావరణం కాలుష్యం ఎక్కువవుతోంది. ఈ నేపథ్యంలో జీవన ఎరువుల వాడకం ప్రాముఖ్యతను సంతరించుకుంది. వీటి వల్ల కలిగే ప్రయోజనాలను వ్యవసాయాధికారులు వివరించారు.

నత్రజని అందించే ఎరువులు

రైజోబియం: పప్పు జాతి పంటలకు నత్రజని అందించే జీవన ఎరువుగా వాడాలి. కంది, పెసర, మినుము, శనగ, వేరుశెనగ, సోయాచిక్కుడు వంటి పైర్లకు రైజోబియాన్ని విత్తనాలకు పట్టించి ఉపయోగించాలి. దీనివల్ల మొక్క వేర్లపై లేత గులాబి రంగు బుడిపెలు ఏర్పడతాయి. 100 మి.లీ. నీటిలో 10 గ్రాముల పంచదార లేదా బెల్లం, లేదా గంజిపొడర్‌ను 10 నిమిషాల పాటు మరగబెట్టి చల్లార్చాలి. ఈ ద్రావణం 10 కిలోల విత్తనాలపై చల్లి దానికి 200 గ్రాముల రైజోబియం కల్చర్ పొడర్‌ను బాగా పట్టించి విత్తనం చుట్టూ పొరలా ఏర్పడేలా చూడాలి. పాలిథిన్ సంచి/ప్లాస్టిక్ తొట్టిలో ఈ ప్రక్రియ చేయవచ్చు. తర్వాత 10 నిమిషాలు విత్తనాలను ఆరబెట్టి పొలంలో నాటుకోవాలి.

అజిటో బాక్టర్: పప్పు జాతి పంటలను మినహాయించి మిగతా పంటలకు నత్రజని జీవన ఎరువుగా ఉపయోగపడుతోంది. ఈ బ్యాక్టీరియా నత్రజనిని స్థిరీకరించడమే కాకుండా మొక్కకు కావాల్సిన పోషకాలను అందిస్తుంది. ఆకు కూరలు, కూరగాయలు, పూలతోటల సాగుకు ఈ విధానం అనుకూలంగా ఉంటుంది. 2కిలోల కల్చర్ పొడర్‌ను 200 కిలోల సేంద్రియ ఎరువులో కలిపి విత్తనం నాటే సమయంలో ఎకరా సేలపై చల్లాలి. భూమిలో తగినంత తేమ ఉండాలి.

అజోస్పైరికల్లమ్: ఈ బ్యాక్టీరియా మొక్కవేరు చుట్టూ పెరుగుతుంది. లెగ్యూమ్ జాతి పంటలకు తప్పించి మిగతా పంటలైన వరి, పత్తి, మిరప, జొన్న, సజ్జ, పొద్దుతిరుగుడు, అరటి తదితర పంటలకు వాడుకోవచ్చు. తక్కువ కాలం పంటలకు 2 కిలోల అజోస్పైరికల్లమ్ కల్చర్‌ను 80–100కిలోల సేంద్రియ ఎరువులో కలిపి వేసుకోవాలి. నారుమడి పంటలకు 70–80 లీటర్లు పట్టే చిన్నమడిని తయారు చేసుకోవాలి. ఆ నీటిలో 2 కిలోల అజోస్పైరికల్లమ్ ఎరువును కలిపి ద్రావణంలో 10 నిమిషాలు వేర్లను మాత్రమే ముంచి వెంటనే నాటుకోవాలి.

నీలిఆకుపచ్చ నాచు(సైనో బాక్టీరియా): ఇది వరి పంటకు మాత్రమే ఉపయోగపడే నత్రజని సంబంధిత ఎరువు. ఈ జీవన ఎరువుల్లో నాస్టాక్, ఎలాబినా, కెలోరిక్స్ తదితర సైనో బ్యాక్టీరియాలు ఉంటాయి. ఎకరా పొలంలో వరినాట్లు వేసిన 3–7 రోజులకు 4–6 కిలోల జీవన ఎరువులు 40–50 కిలోల సేంద్రియ ఎరువులతో కలిపిచల్లాలి. ఇది వేసిన 15–20 రోజులకు నాచు అల్లుకుపోయిన తరువాత నీటిని తొలగించి నాచును మట్టిలో కలిసేలా చూడాలి.

అజోల్లా: ఈ జీవన ఎరువు నీటిపై తేలియాడుతూ వరి పొలంలో పెరిగే ఫెర్నోజాతి మొక్క. నత్రజనిని మాత్రమే గాక సేంద్రియ కర్బనం, పొటాషియంను వరిపైరుకు అందిస్తుంది. వరి నాటిన వారం రోజుల తరువాత సుమారు 200 కిలోల అజోల్లా జీవన ఎరువును ఎకరం పొలంలో వెదజల్లి 15–20 రోజులు నీటిపై పెరగనివ్వాలి. తర్వాత నీటిని తొలగిస్తే 3–4 రోజుల్లో కుళ్లిపోయి మొక్కకు పోషకాలను అందిస్తోంది.

అసిటో బాక్టర్: చెరకు పంటకు మాత్రమే ఉపయోగపడుతుంది. మొక్క వేర్లలో కాకుండా పైభాగంలోనూ జీవించి నత్రజనిని మొక్కలకు అందిస్తుంది. ఎకరా చెరకు పంటలో 4 కిలోల జీవన ఎరువులను రెండు దఫాలుగా వాడాలి.

ఫాస్ఫో బాక్టర్: భాస్వరం అందించే ఈ జీవన ఎరువు అన్ని పంటలకు వాడవచ్చు. ఇది బాగా పనిచేసేందుకు సేంద్రియ కర్భరం అత్యవసరం. ఎరువుతో పాటు కలిపి వాడితే మొక్కలకు రోగనిరోధకశక్తి పెరుగుతుంది. ఎకరాకు 2 కిలోల పాస్ఫోబాక్టర్‌ను 200 కిలోల పశువుల ఎరువులో కలిపి దుక్కిలో మొక్క సాళ్లలో పడేలా చేయాలి. తగినంత తేమ ఉండాలి.

వాడకంలో జాగ్రత్తలు

- జీవన ఎరువులను ఎండ వేడి తగలని చల్లని ప్రదేశంలో నిల్వ ఉంచాలి.
- రైతు వాడే జీవన ఎరువులు ఆ పంటలకు సరైనవిగా ఉండాలి.
- ప్యాకెట్‌లో ఉన్న గడువు తేదీ లోపు మాత్రమే ఉపయోగించాలి.
- రసాయనాలతో విత్తన శుద్ధి చేసేటపుడు 24–28 గంటల వ్యవధి ఉండాలి.
- రసాయన ఎరువులతో కలిపి జీవన ఎరువులు వాడరాదు.
- సమర్థంగా పనిచేసేందుకు నాణ్యత గల సల్ఫర్‌ను వాడాలి.
- పొలంలో తగినంత తేమ ఉన్నపుడు మాత్రమే వినియోగించాలి.
- సేంద్రియ ఎరువులతో కలిపి వెంటనే పంటకు వాడుకోవాలి.



వివిధ రకాల జీవన ఎరువులు



ఆకట్టుకున్న నృత్యం

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన ఆస్థాన మండపంలో ఆదివారం ఓ ప్రైవేటు స్కూల్ ఆధ్వర్యంలో కూచిపూడి, భరతనాట్య ప్రదర్శన నిర్వహించారు. పిల్లలు ఈ ప్రదర్శనలో పాల్గొని అద్భుతంగా నాట్య ప్రతిభను ప్రదర్శించి ఆహుతులను అలరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అధికారులు, కళాకారులు పాల్గొన్నారు.

నేడు విద్యాసామగ్రి పంపిణీ

తవణంపల్లె: మండల కేంద్రంలోని హైస్కూల్లో సోమవారం ఉదయం 9 గంటలకు విద్యార్థులకు విద్యాసామగ్రి కిట్లు పంపిణీ చేస్తామని ఎంఈఓలు హేమలత, త్యాగరాజులు రెడ్డి తెలిపారు. దీనికి ముఖ్య అతిథులుగా పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, చిత్తూరు ఎంపీ ప్రసాద్‌రావు పాల్గొంటారని వివరించారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

యాదమరి(పూతలపట్టు): మండలంలోని కాశిరాళ్ల ధర్మరాజులగుడి ప్రాంగణంలో సోమ వారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు నాగరాజ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో కంటి పరీక్షలు చేసి, కంటిలో పొర ఉన్న వారికి ఉచితంగా ఆపరేషన్ చేస్తారని తెలిపారు. ఆపరేషన్‌కు ఎంపికై న వారిని ఆస్పత్రి వాహనంలో చెన్నైలోని ఎంఎస్ కంటి ఆస్పత్రికి తీసుకెళ్లి, ఆపరేషన్ అనంతరం అదే వాహనంలో స్వగ్రామానికి తీసుకొస్తారని చెప్పారు. వివరాలకు 94415 35540ను సంప్రదించాలని కోరారు.

నీటి సరఫరాపై కమిషనర్ తనిఖీలు

చిత్తూరు అర్బన్: చిత్తూరులో ప్రజలకు కార్పొరేషన్ నుంచి అందుతున్న నీటి ప్రమాణాలపై మునిసిపల్ కమిషనర్ అరుణ తనిఖీలు చేపట్టారు. కమిషనర్ ఆదివారం టీటీడీ కల్యాణ మండపం పక్కనున్న రిజర్వాయర్ (టీఎస్ఆర్), గాయత్రి నగర్ వద్ద సంపు, పైప్‌లైన్ ఆఖరి పాయింట్ల వద్ద నీటికి ఆర్సీ టెస్ట్ (రెసిడ్యుయల్ క్లోరిన్) నిర్వహించి, నీటి నాణ్యతను పరీక్షించారు. స్థానిక మహిళలతో కమిషనర్ మాట్లాడుతూ, కాలానుగుణమైన వ్యాధుల నియంత్రణ చర్యల్లో భాగంగా నగర ప్రజలకు నాణ్యమైన నీటి సరఫరా కోసం చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రజలు సైతం సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రధానంగా తాగేందుకు ఉపయోగించే ఏ రకమైన నీటినైనా బాగా కాచి చల్లార్చిన తర్వాతే తాగాలన్నారు. ఈ సీజన్లో బయటి ఆహార పదార్థాలు తీసుకోవడం కనిష్ట స్థాయిలో తగ్గించాలన్నారు. చిన్నపిల్లలు, 50 ఏళ్లు పైబడిన వారు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు. సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం నగరంలో ఇప్పటికే ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, రెండవ దఫా డ్రైనేజీ కాలువల పూడికతీత పనులు వేగంగా జరుగుతున్నాయని వివరించారు. నగరంలోని ప్రైవేటు నీటి శుద్ధి ప్లాంట్లలో విస్తృతంగా తనిఖీలు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు గోమతి, డీఈలు వెంకట ప్రసాద్, రమణ, ఏఈ లోకేష్, వార్డు అమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.



నీటి ప్రమాణాలు పరిశీలిస్తున్న కమిషనర్



పలమనేరు సమీపంలోని కౌండిన్య నదిలో ఇసుకను తోడేస్తున్న కూలీలు

కౌండిన్యలో సైఖితం

- రెచ్చిపోతున్న పచ్చనేతలు
- ఇష్టారాజ్యంగా జేసీబీలతో తవ్వకాలు
- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- పట్టించుకోని అధికారులు

పలమనేరు : కాసులు పోగేసుకోవడమే లక్ష్యంగా టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. ఇసుక అక్రమ రవాణాతో యథేచ్ఛగా దోచుకుంటున్నారు. కౌండిన్య నదిలో నీటిమట్టం తగ్గిన ప్రాంతాల నుంచి ఇప్పటికే వందలాదిలోడ్ల ఇసుకను తోడేశారు. ఏమాత్రం జంకుగొంకు లేకుండా పట్టపగలే జేసీబీలను పెట్టి ఇసుకను తవ్వేస్తున్నారు. ట్రాక్టర్లలో ఇష్టారాజ్యంగా తరలించేస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఎవరైనా ఫిర్యాదు చేసినా తమకేమీ తెలియనట్టు వ్యవహరిస్తున్నారు.

ట్రాక్టరైతే రూ.3వేలు!

ఓ వైపు అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఇసుకను నామమాత్రపు సీనరీస్ చార్జీలతో అవసరమైన వారికి సరఫరా చేస్తామని చెబుతోంది. ఇలాంటి తరుణంలో ఇసుక అక్రమ రవాణా తగ్గాలి. కానీ ఇక్కడ మాత్రం అక్రమ రవాణా జోరందుకుంది. ప్రస్తుతం ట్రాక్టర్ ఇసుక రూ.3వేలుగా వ్యాపారులు విక్రయాలు చేస్తున్నారు. అదే లారీ ఇసుకైతే రూ.20వేల దాకా పలుకుతోంది.



ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు

అధికారంలోకి రాగానే పచ్చనేతలు అక్రమార్జనకు తెరతీశారు. అందులో భాగంగా కౌండిన్యలో ఇసుక దోపిడీకి శ్రీకారం చుట్టారు. ఇదే అదునుగా తెలుగు తమ్ముళ్ల పేరుతో మరికొందరు సైతం నదిలో అక్రమ తవ్వకాలను మొదలుపెట్టేశారు. జేసీబీలను పెట్టి నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తోడేస్తున్నారు. వందలాది ట్రాక్టర్లతో యథేచ్ఛగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు.

నదిలో ఎటు చూసినా ఇదే తంతు



పలమనేరు నియోజకవర్గంలోని పెద్దపంజాణి, గంగవరం, పలమనేరు మండలాల్లో 40 గ్రామాల మీదుగా కౌండిన్య నది ప్రవహిస్తోంది. మొన్నటిదాకా చెక్‌డ్యామ్‌ల వద్ద నీరుండేది. ఇప్పుడు నీరు తగ్గడంతో ఆయా గ్రామాల వద్ద ఇసుక తవ్వకాలు మొదలైయ్యాయి. ఆయా పంచాయతీలకు చెందిన పచ్చనేతలు ఇదంతా తమ సొంత జాగీరైనట్టు జేసీబీలు పెట్టి మరీ ఇసుకను తరలిస్తున్నారు. ముఖ్యంగా పెద్దపంజాణి మండలంలోని కౌండిన్య పరిసర గ్రామాలు, గంగవరంలోని క్యాటిల్‌ఫామ్ దాకా, పలమనేరు మండలంలోని మొరం, సముద్రపల్లె, కృష్ణాపురంలో పదిరోజులుగా అక్రమ రవాణా ఊపందుకుంది. పలమనేరు పట్టణానికి మంచి నీరు అందించే బోర్లు నాగమంగళం వద్ద ఉన్నాయి. అక్కడే బ్రిటీషర్ల కాలంలో నిర్మించిన డ్యామ్ సైతం ఉంది. ఇసుకాసురుల కారణంగా ఆ డ్యామ్ సైతం దెబ్బతిని కూలేందుకు సిద్ధంగా మారింది.

పంట మార్పిడితో చీడపీడలు దూరం

- ఎరువులు, పురుగుమందు ఖర్చు తగ్గుముఖం
- మంచి దిగుబడి, అధిక లాభం

పాలసముద్రం: పంటల మార్పిడి చేస్తే తెగుళ్లను, చీడపీడలను నివారించవచ్చని పాలసముద్రం వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్ పేర్కొన్నారు. తర్వాత ఎరువులు, పురుగుమందుల ఖర్చులు కూడా తగ్గుతాయన్నారు. ప్రస్తుత పంటల స్థానంలో ఏయే పంటల సాగుతో లాభాలేమిటో ఆయన వివరించారు. ఎప్పుడూ ఒకే రకమైన పంటలు సాగు చేయడం మంచిదికాదు. దీని వల్ల చీడపీడలు వృద్ధి చెందుతాయి. ఒక పంట వేసిన తరువాత వేరే పంటను సాగు చేయడంతో రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. కొన్ని పంటలకు తెగుళ్లు, పురుగులు ఎక్కువగా ఆశిస్తుంటాయి. చీడపీడలు ఆశించిన పంటను ఎంచుకుని సాగు చేసుకుంటే అధిక లాభం సాధించవచ్చు.

పంట మార్పిడి విధానం

- ప్రస్తుతం మెట్టలో వరికోతలు ప్రారంభమయ్యాయి. రానున్న రబీ సీజన్‌లో నీటి తడులతో ఇబ్బంది కలిగే అవకాశముంది. అందువల్ల వరికి ప్రత్యామ్నాయంగా పెసులు, వేరుశనగ వంటి నూనె గింజలు వేసుకోవడం మంచిది.
- అరటిలో ఎక్కువగా బ్యాక్టీరియా, దుంపకుళ్లు తెగుళ్లు ఆశిస్తున్న పొలాల్లో వరి, చెరకు వంటి పంటలను సాగు చేసి పంట మార్పులు చేసుకోవాలి.
- తమలపాకు తోటల్లో ఎండు తెగుళ్లు, మొదలు కుళ్లు తెగులు వ్యాపించినప్పుడు కనీసం మూడేళ్లకు ఒకసారి మొక్కజొన్న వంటి పంటలను సాగు చేసుకోవచ్చు.



- వంగ పంటలో ఆశించే ఎండు తెగులుకు నివారణ కష్టం. దీంతో ఈ తెగులు సోకిన నేలలో కాలీఫ్లవర్ వేసుకుంటే మంచిది. వంగలో నులి పురుగులు ఎక్కువగా ఉంటే తరువాత బంతి పూలు వేసుకోవాలి.
- టమాటాలో ఎండు తెగులు ఆశిస్తే ఫ్రెంచ్ చిక్కుడు సాగు చేస్తే ఆ తెగుళ్లు తగ్గుతాయి.
- కూరగాయలు, తీగజాతి కూరల తెగుళ్ల నివారణకు వరి పంట సాగుతో పంట మార్పిడి చేసుకోవాలి.
- మిరప, టమాట, వేరుశనగ, కాలీఫ్లవర్ వంటి పంటలకు ఆశించే లద్దె పురుగు నివారణకు ఆ పంట పూర్తయ్యాక, సజ్జ, జొన్న, వరి, పొద్దు తిరుగుడు తదితర ఆరుతడి పంటలతో పంట మార్పిడి చేసుకోవాలి. అలాగే బంతిపూలు, ఆవాలు వంటి పైర్లను సాగు చేస్తే ఆకు ముడత తెగులును పారదోలవచ్చు.
- పసుపు పండించిన తరువాత వరి, జొన్న సాగు చేస్తే నులిపురుగులను నివారించవచ్చు.



సాగవుతున్న వరిపంట

ఒకే కుటుంబ పంటలు వద్దు



పంటల సాగు తరచూ మారుస్తుండాలి. ఒకే కుటుంబానికి చెందిన పంటలను వేయడంతో వాటికి సోకిన తెగుళ్లు, చీడపీడలు భూమిలో అలాగే ఉండిపోతాయి. తిరిగి పంట సాగు చేసిన సమయంలో ఆ పంటకు తప్పకుండా తెగుళ్లు, చీడపీడలు ఆశిస్తాయి. ఉదాహరణకు టమాట, వంగ, మిరప, బెండ పంటలు ఒకే కుటుంబానికి చెందినవి. ఇవి ఒక దాని తరువాత ఒకటి వేయడంతో గత పంటకు ఉన్న తెగుళ్లు మరొక పంటకు సోకుతాయి. కావున తరచూ పంటల మార్పిడి తప్పనిసరిగా చేయాలి. లేకుంటే పలు సమస్యలు తలెత్తుతాయి. పంటల మార్పిడి చేసుకుంటూ ఉంటే రైతులకు ఖర్చులు కూడా తగ్గుతాయి. అలాగే ఆదాయం పెరుగుతుంది.

– ఢిల్లీప్రసాద్, వ్యవసాయాధికారి